



# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 04 జూన్ 2026 పేజీలు : 04


# దళితులపై అణిచివేతకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తాం

**రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కే. ఎస్.జవహార్**



అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కే.ఎస్.జవహార్


ప్రజల నుండి వినదుల స్వీకరిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహార్ సాయి

**శ్రీ సత్యసాయి జిల్లా, జూన్ 03, ప్రభాతవార్త ప్రతినిధి**

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని జిల్లా కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు హాల్ నందు బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల కమిషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారితో పాటు మడకశిర శాసనసభ్యులు ఎం.ఎస్. రాజు, ఐఏఎస్ అధికారి ఎస్. చిన్న రాముడు, కమిషన్ సభ్యులు భిక్షం మేకల, రామాంజనమ్మ, ఇతర కమిషన్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉదయం 10.00 గంటల నుండి పిజిఆర్ఎస్ హాల్ నందు ప్రజల నుండి నేరుగా సమస్యలపై అర్జీలను స్వీకరించే కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుండి వచ్చిన దళితులు, వివిధ వర్గాల ప్రజల నుండి దాదాపు 170 వినతులు/అర్జీలను కమిషన్ చైర్మన్, సభ్యులు స్వయంగా స్వీకరించి, బాధితుల సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 02.00 గంటల నుండి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహార్ మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడా దళితుల మీద ఎటువంటి దాడులు, అణచివేతలు జరగకుండా అత్యంత కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దళితుల రక్షణకు, హక్కులకు భంగం కలగకుండా చట్టాలను పకడ్బందీగా అమలు పరుస్తామని స్పష్టం చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, ఎస్సీ సబ్ ప్లాన్, ఇతర సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమ, సాధికారత అధికారి సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రెడ్డి బాలాజీతో పాటు, జిల్లా, మండల స్థాయికి చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# ఆమిద్యాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం విభజన..!

-మళ్లీ ఏర్పాటు కానున్న ఆమిద్యాల, పి.కౌకుంట్ల పీఏసీఎస్‌లు -గతనెల 22న నిర్వహించిన మహాజన సభలో తీర్మాణం

-నెల రోజులపాటు అభ్యంతరాలు తెలియజేయడానికి గడువు

**ఉరవకొండ, జూన్ 3 ప్రభాతవార్త**

ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం విభజనకు మార్గం సుగుమం అయింది. పరిపాలన సౌలభ్యం, సభ్యులకు మెరుగైన సేవలు అందించడం, కార్యకలాపాల సమర్థ నిర్వహణ తదితర కారణాల దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమిద్యాల పీఏసీఎస్‌ను ఇదివరకటి తరహాలో ఆమిద్యాల, పి.కౌకుంట్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలుగా విభజించనున్నారు. గతనెల 22వ తేదీన సంఘంలో విభజన ప్రక్రియ ప్రత్యేక అధికారి రామచంద్రయ్య, డీఎల్‌సీవో వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో సంఘం సీఈవో రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభలో ఈ మేరకు తీర్మాణం చేశారు. ప్రతి పీఏసీఎస్ యొక్క కార్యకలాపాల పరిధి, సభ్యత్వ పంపిణీ, ఆస్తులు, బాధ్యతల విభజన, ఉద్యోగుల కేటాయింపు, నూతన ఉప నిబంధనలు (బైలా), తాతా ్కలిక అడహాక్ కమిటీ నియామకం



ఆమిద్యాల గ్రామంలో గల పీఏసీఎస్ భవనం

సంబంధించి విభజన అంశాలను ప్రతిపాదించారు. ప్రతిపాదిత విభజనపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే నోటీసు వెలువడిన తేదీ నుండి 30 రోజులలోపు తమ అభ్యంతరాలను రాతపూర్వకంగా కార్యాలయంలో అందించాల్సి ఉంది. నిర్దిష్ట గడువులోగా ఎటువంటి అభ్యంతరాలు అందకపోతే ప్రతిపాదిత విభజనకు ఎటువంటి అభ్యంతరాలు లేవని భావించి ఆం ధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టం 1964 నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నారు. కాగా ప్రస్తుతం ఉన్న ఉమ్మడి ఆమిద్యాల పీఏసీఎస్ పరిధిలో 2,331 మంది సభ్యులు ఉండగా ఇందులో 1,158 రైతులు 11,13,32,028 రూపాయలు రుణాలు పొంది ఉన్నారు. కాగా 2023లో ఆమిద్యాల, పి.కౌకుంట్ల పీఏసీఎస్‌లను అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విలీనంచేసి ఆమిద్యాల పీఏసీఎస్‌గా చేసిన విషయం తెలిసిందే.

# గుడిసె దేవానంద్ నివాసానికి విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్


దేవానంద్ నివాసంలో తేనేటి విందులో పాల్గొన్న ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్.జవహార్

**కదిరి, జూన్ 3 ప్రభాతవార్త**

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె దేవానంద్ నివాసానికి బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్.జవహార్ విచ్చేశారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు బిజెపి నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు గుడిసె దేవానంద్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మాదిగ, మాల, రెల్లి కులాలకు చెందిన సమస్యలపై ఆయనకు వివరించారు. గతంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రస్తుతం ప్రవేశ పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు దేవానంద్ దంపతులు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మెంబర్లు సతీష్ కుమార్, బేకరి గంగాధర్, రామాంజులమ్మ, సంపత్, ఆదెప్ప, బిజెపి నాయకులు ఉత్తం రెడ్డి, మైనుద్దీన్, ఖాసీం, ఛాంద్ బాషా, మోహన్‌లు పాల్గొన్నారు.

### మాదిగ సమస్యలు పరిష్కరించాలి ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి

సత్యసాయి జిల్లాలో మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సత్యసాయ ఇజిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్.జవహార్‌కు మాదిగ ఉద్యోగుల సమైక్య ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర నాథ్ మాట్లాడుతూ.. ఎస్సీ ఉద్యోగులు ఉన్నత విద్యకు సంబంధించిన జీవో 342లో ఉన్న లోపాలను సవరించి ఉద్యోగుల జీవిత కాలం ఒకసారి వేతనంతో కూడిన విద్యా సెలవు కల్పించాలని ఎలాంటి ఉన్నత విద్యను అభ్యసించుటకు అనుమతులు ఇవ్వాలని ఎస్సీ కాలనీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను పరిమితం చేయకుండా ఎస్సీ ధృవీకరణపత్రం కలిగిన ప్రతి కుటుంబానికి వర్తింప జేయాలని, జిల్లా కేంద్రంలో జాంభవ భవన నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం, రూ.5కోట్లు నిధులు కేటాయించాలని, ప్రతి నియోజకవర్గంలో జాంభవ భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయించాలని ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జిల్లా యూనిట్‌గా త్వరితగతిన విడుదల చేసి అత్యంత వెనుకబడిన మాదిగ కుటుంబాలకు రెండు ఎకరాల సాగు భూమిని కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. సమస్యలన్నింటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని చైర్మన్ ఎంఈఎఫ్ నాయకులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల నుంచి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అవినీతిని తూచేదెవరు..

# అక్రమాలను ఆపేదెవరు..!


1.57 కి.గ్రా తూకంతో లబ్ధిదారుల నెత్తిన డబ్బా


పెద్ద సంచిపై చిన్న సంచి ఉంచితేనే సరైన తూకం వచ్చేది

- ❖ పేదల బియ్యం..అక్రమార్కులకు భోజ్యం.!
- ❖ ఒక్కరంటే ఒక్కరే..తనిఖీలు అంతంతే.!
- ❖ తరలిస్తూ దొరికినా తగ్గేదేలే..!


అక్కడ దోచి..ఇక్కడ దాచి..!

**తాడిపత్రి, జూన్3, ప్రభాతవార్త**

పేదల కోసం ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని కొందరు డీలర్లు తక్కువ తూకం తూచి పేదలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒక్కో కార్డుకు ఇచ్చే బియ్యంలో 1.57 కిలోల తక్కువ తూకం ఇస్తున్న డీలర్ల బాగోతం తూనికలు, కొలతల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో బట్టబయలైంది. ఏటా ఆకస్మిక తనిఖీలు చేసి వందల సంఖ్యలో కేసులు నమోదు చేస్తున్నా డీలర్లలో మార్పు రావడం లేదని అధికారులు, బాధితులు ఆందోళన చెందడం మినహాయించి ఏమీ చేయలేని పరిస్థితి. ఉచిత బియ్యమే కదా అని..ఒకటిన్నర కిలోనే కదా అని డీలర్ల దోపిడీని పేదలు ప్రశ్నించకుండా మిన్నకుండిపోతున్నారు. డీలర్లు ఇలా మిగిలిని బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.16 లు ప్రకారం అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో డీలరు ఇలా నెలకు కనీసం రూ. 7 వేలు వంతున సంపాదిస్తున్నట్లు అంచనా. చూసేందుకు ఇది తక్కువ మొత్తంగా కనిపించినా జిల్లా వ్యాప్తంగా లెక్క కడితే డీలర్ల దోపిడీ రూ. కోట్లలో ఉంటోంది.

### పేదల బియ్యం..అక్రమార్కులకు భోజ్యం..!

నియోజకవర్గ పరిధిలోని తాడిపత్రి పట్టణంతో పాటు తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల పరిధిలో మొత్తం 207 చౌకదుకాణాల పరిధిలో 87,119 రేషన్ కార్డులున్నాయి. ఈ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిపొందుతున్న లబ్ధిదారులు2,68,448 మంది ఉన్నారు. 87,119 కార్డులకు గానూ తూనికలు కొలతల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో బయటపడిన విధంగా 1.57 కిలోల వంతున మొత్తం 1,36,776 కిలోల పేదల బియ్యం పక్కదారి పడుతోంది. వీటిని దళారులకు కిలో రూ.16 లకు విక్రయిస్తున్నారు. ఆ లెక్కన డీలర్లు ప్రతి నెలా రూ.21.88 లక్షలు దోచేస్తున్నారు. ఇవే బియ్యాన్ని దళారులు కిలో రూ.22 లకు నల్లబజారుకు తరలిస్తున్నారు. ఆ లెక్కన పేదలకు వెచ్చిస్తున్న రూ. 30 లక్షల ప్రభుత్వ ధనం ప్రతి నెలా అక్రమార్కులకు భోజ్యంగా మారుతోంది. ఏడాదికి కనీసం రూ. 3 కోట్లు అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నా అటు ప్రజలు, ఇటు ప్రభుత్వ అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోతున్నారు.

### అవినీతిని తూచేదెవరు..?

క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు రేషన్ దుకాణాలపై నిఘా ఉంచాల్సిన పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ విభాగం, తూనికలు కొలతల శాఖ అవినీతిని తూచలేకపోతున్నాయి. తూనికలు కొలతల శాఖ, పౌరసరఫరాల శాఖలకు తాడిపత్రి, యాడికి పరిధిలో ఒక్కరంటే ఒక్కరే ఉండటంతో తనిఖీలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. బియ్యం సేకరించే దళారులు గ్రామాల్లో ప్రజలను మభ్యపెట్టి తూకంలో తక్కువ చూపి ఇంటింటికి వెళ్లి బియ్యం సేకరిస్తున్నారు. డీలర్ల దగ్గర, ఉచిత బియ్యం అమ్ముకునే ప్రజల దగ్గర మరింత తక్కువ తూకాలతో బియ్యం సేకరిస్తున్న దళారులు వాటిని అక్రమంగా సరిహద్దులు దాటేస్తున్నారు. ప్రజా పంపిణీ విధానం ద్వారా పేదలకు అందాల్సిన బియ్యం అక్రమదారిలో తరలిపోతున్నా అడపాదడపా దాడులే తప్ప అడ్డుకట్ట వేసే దమ్ము సంబంధిత శాఖలకు లేదని కొందరు డీలర్లు బాహాటంగానే సవాలు విసురుతున్నారు. తాడిపత్రి మండలం, పట్టణం, యాడికి తదితర చౌక బియ్యం అడ్డాల్లో దాడులు చేసి పట్టుకున్నా కొందరు లాలూచీ అధికారుల సహకారంతో నల్లబజారు వ్యాపారం జోరుగానే సాగుతోంది.

బియ్యం దందా పదే పదే సాగిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామనే అధికారుల మాటలు గాలి మాటలుగానే మిగిలిపోతున్నాయి. అధికారుల తనిఖీలు తూతూమంత్రంగానే మిగిలిపోతుండటంతో అవినీతిని తూచే అధికారులే కంటికి కనిపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

### అక్రమార్కులకు సహకరిస్తున్న ఇంటిదొంగలు

పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని తమ వ్యాపార వస్తువుగా మార్చుకున్న కొందరు డీలర్లు, దళారులు, వ్యాపారులపై నిఘా ఉంచాల్సిన ప్రభుత్వ విభాగాల్లో కొందరు ఇంటి దొంగలు ఉండటం కూడా అక్రమార్కులు చెలరేగి పోవడానికి కారణమని తెలుస్తోంది. పోలీసు విభాగంలో ఉన్నతాధికారుల కళ్లుగప్పి కొందరు కిందిస్థాయి సిబ్బంది అక్రమ వ్యాపారులకు సహకరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు అధికారులు ఈ నల్లబజారుపై దాడులకు బయలు దేరగానే ఈ సిబ్బందే అక్రమార్కులకు ఉప్పందిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక కొందరు రెవెన్యూ అధికారులు తమకు మామూళ్లు ఇచ్చి మీరేమైనా చేసుకోమని, అయినా ప్రజలు అమ్ముతుంటే మీరు కొంటున్నారు మీ తప్పేముంది అంటూ మెట్ట వేదాంతం ఒలకపోస్తున్నారని చర్చ నడుస్తోంది. ఇలాంటి వారిపై విజిలెన్స్ డేగకన్ను వేస్తే తప్ప ఈ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయలేని పరిస్థితి తలెత్తుతోంది. జిల్లా పౌరసరఫరాలు, తూనికలు కొలతల శాఖల అధికారులు సంయుక్తంగా విస్తృత దాడులు నిర్వహిస్తే అక్రమ డీలర్లు,వ్యాపారుల చౌక బియ్యం దందాను అడ్డుకోవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.



తరలిస్తూ దొరికినా తగ్గేదేలే..!

## పంటలు వర్షార్పణం..

# రైతులకు భారీ నష్టం


టమోటా మొక్కలు వర్షానికి కొట్టుకపోవడంతో ఖాళీ అయిన భూమి,

**కంబదూరు, జూన్ 3, ప్రభాత వార్త**

కంబదూరు మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. పలు గ్రామాల్లో సాగుచేసిన పంటలు నీట మునిగి దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వంటారెడ్డిపల్లి, గుళ్యం గ్రామాలకు చెందిన రైతులు సోమశేఖర్ మరియు బోయ సుకన్య టమోటా పంటను సాగు చేశారు. ప్రస్తుతం నాట్ల దశలో ఉన్న టమోటా పంట వర్షపు నీటిలో పూర్తిగా మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఎంతో ఆశతో పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట ఒక్క రాత్రిలోనే దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరవు తున్నారు. అలాగే కుర్లపల్లి గ్రామానికి చెందిన రైతు హరీష్ సాగు చేసిన కర్బూజ పంట కూడా వర్షపు నీటిలో మునిగిపోయింది. పొలంలో నిల్వ ఉన్న నీటి కారణంగా పంటకు తీవ్ర నష్టం సంభవించినట్లు రైతు తెలిపారు. ఈ వర్షాల వల్ల లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి, ప్రభుత్వం నుంచి తగిన నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.


నీట మునగిన కర్బూజా పంట

## కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

4>>

02ATP03.qxd:02ATP03.qxd 04/06/26 11:28 PM Page 1



## గుడ్డం కోనేరు అభివృద్ధి పనులు ప్రారంభం

- ఆగస్టులోగా పనులు పూర్తి చేస్తామన్న కమిషనర్



భూమి పూజ దృశ్యం

**హిందూపురం జూన్ 3 ప్రభాతవార్త**

ఎన్నో ఏళ్లుగా పట్టణంలోని గుడ్డం శ్రీ రంగనాథ స్వామి దేవాలయం కోనేరు అభివృద్ధి కోసం రూ. 1.50 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. కెమెరాకు గుడ్డం కోనేరు ప్రాంతంలో కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పి ఏ లు వీరయ్య, బాలాజీ కొబ్బరికాయ కొట్టి పూజ నిర్వహించి పనులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలయ్య కృషితో ఆహ్వానిధులు ఒకటిన్నర కోట్ల రూపాయలు వచ్చాయని ఆగస్టు నెలలోపు ఈ పనులను పూర్తి చేస్తామని వివరించారు. రాత్రి వేళల్లో కూడా కోనేరు అభివృద్ధి పనులు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రమేష్ రెడ్డి, ఇన్చార్జ్ ఆదర్శ్, జనసేన నిమ్మకాయల రాము, వై టి పి శ్రీనివాసులు మొదలవారు పాల్గొన్నారు.

## వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి



రాగుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడిఏ, ఏవో.

**హిందూపురం టౌన్ జూన్ 03 ప్రభాతవార్త**

హిందూపురం మండలంలోని రైతులందరూ సబ్సిడీ వేరుశనగ కోసం నేటి నుండి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడిఏ కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ లు తెలిపారు. బుధవారం హిందూపురం మండలం మనేసముద్రం గ్రామం నందు రాగుల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సబ్సిడీ వేరుశనగ కోసం రైతులు నేటి నుండి అన్ని రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఒక బస్తా ధర 3060 కాగా 1224 అంటే 40 సబ్సిడీతో 1836 రూపాయలు రైతులు చెల్లించి వేరుశనగ పందువచ్చని అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే వేరుశనగ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఒక్కొక్క రైతుకు ఒక బస్తా నుండి మూడు బస్తాల వరకు భూమినిబట్టి వేరుశనగ పంపిణీ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ శంకరప్ప. రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తండాలో తీరిన తాగునీటి సమస్య



బోరులో పుష్కలంగా నీరు వస్తున్న దృశ్యం

**రొళ్ల జూన్ 3(ప్రభాత వార్త):**

మండల పరిధిలోని ఆవినకుంట తాండలో నీటి సమస్య పరిష్కారం అయ్యింది.గత కొన్ని నెలల క్రితం గ్రామ ప్రజలు త్రాగు నీటి సమస్యతో ఇబ్బందులు పడ్డారు.ఈ విషయం స్థానిక ఎస్టీ సెల్ అధ్యక్షుడు హను మంత నాయక్, యువ నాయకులు యోగానంద్, పంచాయతీ అధ్యక్షులు నాగేంద్ర మడకశిర ఎమ్మెల్యే,టీటీడీ బోర్డు మెంబర్,జిల్లా టిడిపి అధ్యక్షులు ఎమ్మెస్ రాజు దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే చొరవతో వెంటనే గ్రామానికి తమ సొంత నిధులతో బోరు తవ్వించగా పుష్కలంగా నీరు పడ్డాయి. సమస్య తీరడంపై గ్రామ ప్రజలు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీధర్, ప్రిన్సిపల్ మైలారప్ప

**రొళ్ల జూన్3 (ప్రభాత వార్త):**

మండలానికి ఒకటి నుంచి పదవ తరగతి విద్యార్థులకు రెమెడియల్ పుస్తకాలు, సెమిస్టర్ 1 పాఠ్యపుస్తకాలు,6 నుండి 10 వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు మండలానికి చేరినట్లు మండల విద్యాధికారి శ్రీధర్ తెలిపారు. మండలానికి చేరుకున్న వాటిని గురుకుల పాఠశాల నుండి ఆయా పాఠశాలలకు తరగతుల వారిగా పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.పాఠశాల ప్రారంభం రోజు విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాటిని పాఠశాలలో భద్రపరచుకునేటట్లు ఏర్పాట్లు చేసుకోవలసిందిగా ఉపాధ్యాయులకు సూచించారు.

## విత్తన వేరుశనగకు రైతులు నేటి నుండి పేర్లు నమోదు చేసుకోండి

మండల వ్యవసాయ అధికారి చందన



మండల వ్యవసాయ అధికారి చందన

**పెనుకొండ జూన్ 3ప్రభాతవార్త**

మండల పరిధిలోనిలోని రైతులందరూ రానున్న ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తన వేరుశెనగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నేటి నుండి సంబంధిత రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్ కె ఎస్)లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవ చ్చని మండల వ్యవసాయ అధికారి చందన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.వేరుశెనగ విత్తనాలు పొందదల చిన రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు జిల్లాలో వేరుశెనగ విత్తనాల పంపిణీ త్వరలో ప్రారంభం కానుండగా, రైతులు ముందస్తుగా నమోదు చేసుకోవడం ద్వారా విత్తనాల పంపిణీ సజావుగా నిర్వహించుటకు సహకరించగలరని కోరారు. ప్రభుత్వం 40 రాయితీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయనుండగా రైతు వాటా కే6 మరియు టి సి జి ఎస్ 1694 రకాలకు 30 కేజీల బస్తా ధర రూ. 1836అలాగే కే ఎల్ 1812 వేరుశనగ రకం 30 కేజీల బస్తా ధర రూ.1710 నిర్ణయించబడింది అని తెలిపారు.విత్తన వేరుశనగ కావలసిన రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ తీసుకుని సంబంధిత రైతు సేవ కేంద్రాలను సంప్రదించవలెనని తెలిపారు.మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే నమోదు చేసుకోవలసిందిగా మండల వ్యవసాయ అధికారిణి శ్రీమతి కేసీ చందన గారు విజ్ఞప్తి చేశారు.

## సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి



పేరూరులో సమావేశమైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

**రామగిరి, జూన్ 3 ప్రభాతవార్త**

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని గ్రామాలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుందామని టీడీపీ నాయకులు అన్నారు. ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే యూనిట్ స్థాయి సమావేశాలు మండలంలోని ప్రతి పంచాయతీ కేంద్రంలో నిర్వహించారు. ఎస్వీఆర్ గురించి పూర్తిగా అవగాహన కల్గిఉండి ప్రజల్లోకి వెళ్లి వీటి గురించి తెలియజేయాలన్నారు. ఓటర్లతో మరింత సమర్థ వంతంగా అనుసరించాలని రానున్న ఎన్నికలలో అనుసరించాలని అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ప్రజల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసి చైతన్య పరిచి పార్టీకి ఓటువేసేలా మలుచుకోవాలన్నారు. ఈ సమావేశాల్లో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, మండల కన్వీనర్ సుధాకర్, ప్రదానకార్యదర్శి ఆవులముత్యాలు, సింగిల్విండో అధ్యక్షులు మ త్యాలు, పేరూరులో సాగునీటిసంఘం ఆధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మి నరసింహులు, కోట్ల చిత్తరంజన్, యూనిట్ ఇన్చార్జ్ శ్రీనివాసులు, గ్రామకమిటి అధ్యక్షులు సుబ్బు, వెంకటరామిరెడ్డి, బెస్తమల్లికార్జున, రామాంజి, ఎస్సీ సెల్ శ్రీరాములు, కురకుండ్ల నాగరాజు, ఈడిగ శ్రీనివాసులు, నాగేశ్నాయుడు, పేపర్ శీన, అక్కులప్ప, ఎస్.ఆంజనేయులు, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడే మొహమ్మద్ దివాన్ గుట్టగంధం

ఉరుసు మహోత్సవ ఉత్సవాలు...

**అనంతపురం కల్చరల్, జూన్ 3, ప్రభాతవార్త**



అనంతపురం శివారు ప్రాంతం మొహమ్మద్ దివాన్ గుట్ట చెరువు కట్ట వద్ద వెలిసిన హాజరత్ సయ్యద్ ఖాదర్ మోహిద్దీన్ షా ఖాదిరి స్వామి వారి 142వ వార్షిక గంధం, ఉరుసు మహోత్సవాలలో భాగంగా నేడు గంధము మరియు శుక్రవారం ఉరుసు వేడుకలను నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షులు అల్ హాజ్ ఎస్.దాదా పీర్ తెలిపారు. గంధం పల్లకి ఊరేగింపు నేటి రాత్రి 7 గంటలకు అనంతపురం పాత ఊరు పవర్ హౌస్ వద్ద ఉన్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ హాజీ ఎస్.మహబూబ్ సాహెబ్ ఇంటి నుండి బయలుదేరి పాత ఊరులోని పురవీధుల్లో మేళా తాళాల బృందాలు పాల్గొని ఫకీర్లజల్సాలతో ఊరేగింపు బయలుదేరి చెరువు కట్ట దర్గా షరీఫ్ చేరుకుంటుందని పేర్కొన్నారు. దర్గా యందు బనగానపల్లెకు చెందిన సద్గురులు డా.హాజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్ షా ఖాదిరి స్వామి ప్రత్యేక దైవ ప్రార్థన నిర్వహిస్తారని ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 5వ తేదీన శుక్రవారం ఉరుసు సందర్భంగా దర్గా మసీదు వద్ద ఖురాన్ పఠనం, నాతే షరీఫ్, ఆధ్యాత్మిక చింతన, మతసామరస్యం, నైతిక విలువలు తదితర అంశాలపై ఉపన్యాసాలు మధ్యాహ్నం మరియు రాత్రి అన్నదాన కార్యక్రమం, అలాగే రాత్రి ఖవాలి పోటీలు జరుగుతాయని ఇందులో ముంబాయికు చెందిన అదానాన్ నజాన్ ఖ వ్వాల్ రేడియో టీవీ సింగర్ మరియు మైసూర్ కు చెందిన తహసీన్ తాజ్ రేడియో టీవీ సింగర్ ఖవ్వాలీ బృందాలు పాల్గొంటారని తెలిపారు. 6వ తేదీన శనివారం చదివింపులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కులమత రాజకీయాలకు అతీతంగా ఎప్పటివలె జరిగే ఈ దైవ కార్యములో ప్రతి ఒక్కరూ పాల్గొని గంధము ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని హమ్ దర్ద్ దర్గా కమిటీ తరఫున కోరారు.

## అంజినరెడ్డికి వైకాపా నేతల సన్మానం

**లేపాక్షి, జూన్ 3 ప్రభాతవార్త**



అంజినరెడ్డిని సన్మానిస్తున్న వైకాపా నాయకులు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నూతనంగా నియమితులైన సీనియర్ నాయకుడు జి.అంజినరెడ్డిని బుధవారం లేపాక్షి మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనను శాలువాలు, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంజినరెడ్డి పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన నిరంతర సేవలను గుర్తించే పార్టీ అధిష్టానం ఈ కీలక బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారు. అనంతరం అంజినరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన జిల్లా అధికార ప్రతినిధి పదవికి పూర్తి న్యాయం చేస్తానన్నారు. పార్టీ విధానాలను, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు శ్రమిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు శ్యాంప్రసాద్‌రెడ్డి, కే.టి. పవన్‌కుమార్, నరసింహామూర్తి, వెంకటేష్, సురేష్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, నంజిరెడ్డి, వెంకటరెడ్డి, ముజాహిద్, చాందు, లోకేష్‌రెడ్డి, హరి, పాండు, మధు, బన్నీ, గంగన్న, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని అంజినరెడ్డికి అభినందనలు తెలిపారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనం కోసం

## రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ర్ణీ 1 మాట్లాడుతున్న అగ్రికల్చర్ ఏవో మాధురి

**కనగానపల్లి జూన్ 3 ప్రభాతవార్త**

మండలంనకు ఖరీఫ్ 2026-27 సీజన్‌కి వేరుశనగ కే సిక్స్ రకం 1620 క్వింటాళ్లు కె 1812 వేరుశనగ రకం 90 క్వింటాళ్లు టీ సి జి ఎస్ 1694 వేరుశనగరకం 850 క్వింటాళ్లు మొత్తం: 2560 క్వింటాళ్లు ప్రభుత్వం కేటాయించిందని మండల వ్యవసాయ అధికారి బి. మాధురి తెలిపారు. విత్తనం కావాలనుకునే రైతులు వెంటనే తమ సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకోవాలి. రిజిస్టర్ చేసుకునే రైతులు ఆధార్, ఫోన్ నెంబర్, పట్టాదారు పాస్‌బుక్. జిరాక్స్ తీసుకురావాలని అర్ధ ఎకరా ఉన్న రైతుకి: 1 బ్యాగు. అర్ధ ఎకరా నుంచి 1 ఎకరా ఉన్న రైతుకి: 2 బ్యాగులు. 1 ఎకరం పైగా ఉన్న రైతులకు: 3 బ్యాగులు అందజేస్తామన్నారు. టీ సి జిఎస్ 1694 (30 కెజీ బస్తా): మంజూరు ధర రూ. 6120 రైతు వాటా రూ. 1836 (40 సబ్సిడీతో) కె 1812 (30 కెజీ బస్తా): ధర బస్తా రూపంలో రూ.1,710; క్వింటా ధర రూ.5,700 ధరను ప్రభుత్వం నిర్ణయించిందని సబ్సిడీ విత్తనం కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకోవాలని అగ్రికల్చర్ ఏ. ఓ.మాధురి తెలిపారు.

## పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోండి

- ఉపాధి హామీ ఎపిఓ శ్రీకాంత్

**గోరంట్ల, జూన్ 3 ప్రభాతవార్త**

గోరంట్ల మండలంలో పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు ఈ నెల 6వతేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఉపాధి హామీ ఏపిఓ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని రైతులకు పది రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులకు ఉపాధి హామీ ద్వారా మామిడి, చీని, సపోటా, జామ, అల్లనేరేడు, కొబ్బరి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, చింత, తదితర మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఈనెల 6 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పండ్ల మొక్కలు కావాల్సిన రైతులు రైతు జాబ్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పట్టాదారు పాస్‌పుస్తకం, 1 బీ, చిన్న సన్న కారు రైతు సర్టిఫికెట్, అప్లికేషన్‌తో పాటు రెండు ఫోటోలు ఉపాధి హామీ సిబ్బందికి గాని కార్యాలయంలో గాని అందజేయాలని ఆయన తెలియచేశారు.

## పరిశుభ్రత మనందరి బాధ్యత..!

రోడ్డుకి ఇరువైపులా కంపచెట్లను తొలగిస్తున్న వైనం



**ధర్మవరం రూరల్ జూన్ 3 ప్రభాతవార్త**

మండల పరిధిలోని రావులచెరువు గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా విస్తరించి పెరిగిన కంపచెట్లు, ముళ్లపొదలను జేసీబీ సహాయంతో తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.రహదారుల పక్కన పెరిగిన పొదలు వాహనదారుల దృశ్యమానతను తగ్గించి ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీబీ యంత్రంతో కంపచెట్లు, ముళ్లపొదలను తొలగించడంతో రహదారులు పరిశుభ్రంగా మారడమే కాకుండా వాహనాల రాకపోకలకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎల్లప్ప, టీడీపీ నాయకుడు చెన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద ప్రతి బుధవారం గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామస్తులు కూడా పరిశుభ్రత పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

## ప్రభోధానంద ఇందుజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శివయాత్ర

**ధర్మవరంటౌన్, జూన్ 3 ప్రభాతవార్త**



శివయాత్ర చేస్తున్న దృశ్యం

పట్టణంలోని కేశవనగర్లో త్రైత సిద్ధాంతం ప్రభోదాసేవసమితి ఇందూ జ్ఞాన వేదికకమిటి ఆధ్వర్యంలో బుధవారం శివయాత్ర చేపట్టారు.ఈ యాత్రలోత్రైత సిద్ధాంతం ద్వారా తెలిపిన ఇందూ సాంప్రదాయాలు అనే గ్రంథంలో రచించిన జ్ఞానంతో శివయాత్ర జరుపుకోవడం జరిగిందని కమిటి సభ్యులు పేర్కొన్నారు.ఇందూ సాంప్రదాయాలు వంటి గ్రంథంలో అందరివలే శివమును శవం అనుకోకుండా పీడ పిశాచి అనుకోకుండా ప్రతి ఒక్కరూ ఏ పూజా విధానంలో పాల్గొనకపోయిన పర్వాలేదు కానీ శివయాత్రలో భక్తిశ్రద్ధలతో గోవిందా గోవింద అనే నామస్మరణతో సనాతన దర్మాన్ని ఆచరిస్తూ ప్రజలు కూడా ఈ దర్మాన్ని ఆచరించాలన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన ధర్మవరం విద్యార్థి

ఆల్ ఇండియా ర్యాంక్ 2653 సాధించిన విజయ్ సాహుల్ విద్యార్థిని అభినందిస్తున్న గాండ్ల కులస్తులు



**ధర్మవరం రూరల్, జూన్ 3, ప్రభాతవార్త**

పట్టణానికి చెందిన విద్యార్థి విజయ్ సాహుల్ జేఈఈ అడ్వాన్స్‌డ్2026 ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 2653 సాధించి ప్రతిభ చాటాడు. ఈ ఘనత సాధించడంతో కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.ఐటీసీ డిస్ట్రిబ్యూటర్ సూర్యనారాయణ, సునీత దంపతుల కుమారుడైన విజయ్ సాహుల్ సాధించిన విజయాన్ని గుర్తిస్తూ... అఖిల గాండ్లతెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కృషి, పట్టుదలతో చదివితే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో రాణించగలరని విజయ్ సాహుల్ నిరూపించాడన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.సన్మాన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, డాక్టర్ రమణ, డాక్టర్ రోహిల్, డాక్టర్ మదన్, తల్లాకారి, పుట్టపర్తి నరసింహులు తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## పొలాలకు వెళ్లే దారి బాగు చేయండి..!

ఓబుల నాయన పల్లి రైతులు అధికారులకు విన్నపం..
దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న తెదేపా నాయకులు



**ధర్మవరం రూరల్ జూన్ 3 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఓబులనాయనపల్లి గ్రామంలో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఉపయోగించే ప్రధాన దారి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. దారిపై గుంతలు ఏర్పడటంతో పాటు మట్టి కొట్టుకుపోవడంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సాగు పనులు, వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు కష్టసాధ్యంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షం కురిసిన సమయంలో దారంతా బురదమయంగా మారి ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు.పొలాలకు ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ సామగ్రి తరలించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న రహదారిని మరమ్మతు చేసి రైతుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.గ్రామంలోని వ్యవసాయ అవసరాలకు ఈ దారి కీలకంగా ఉండటంతో తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని రైతులు సింగల్ విండో అధ్యక్షుడు మేకల రామాంజనేయులు, తెలుగుదేశం నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఈ నెల 7న ఫుట్బాల్ జట్ల ఎంపిక

**హిందూపురం జూన్ 03 ప్రభాతవార్త**

ఈనెల 7వ తేదీ ఆదివారం పట్టణంలోని ఎంజీఎం పాఠశాల మైదానంలో సత్యసాయి జిల్లా సీనియర్ పురుషులు, మహిళల ఫుట్బాల్ జట్లను ఎంపిక చేస్తున్నట్లు సత్యసాయి జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవి అనిల్ కుమార్ తెలిపారు. ఫుట్బాల్ జట్ల ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 31122010 కంటే ముందు జన్మించిన వారై ఉండాలి, ఎంపికలో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డ్, జనన ధ్రువపత్రం, మూడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, తల్లిదండ్రుల అనుమతి పత్రం తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన అన్నారు. మరిన్ని వివరాలకు సత్యసాయి జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహమ్మద్ సలీం 8099598958 ను సంప్రదించాలని తెలిపారు.

## విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

**బత్తలపల్లి, జూన్ 3 ప్రభాతవార్త**



ఓబిరెడ్డి

విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు మీ పరిధిలో ఉన్న రైతు సేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్. చేసుకోవాలని బత్తలపల్లి మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ బత్తలపల్లి మండలంలోని రైతులు విత్తన వేరుశనగ కాయల కోసం ఆధార్కార్డు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకువెళ్లి రైతు సేవ కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మండలానికి 2,306 క్వింటాళ్లు (కె6 రకం 1116 క్వింటాళ్లు, కె1812 రకం 90 క్వింటాళ్లు, టీసీజీఎస్ 1694 రకం 1100 క్వింటాళ్లు) వేరుశనగ కాయలు కేటాయించినట్లు తెలిపారు. 40 శాతం రాయితీతో వేరుశనగ విత్తన కాయలను ఒక్కో రైతుకు గరిష్టంగా మూడు బ్యాగులు(90 కేజీలు) ఇవ్వడం జరుగుతుందన్నారు. రాయితీ విత్తనాన్ని రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఒక బస్తా పూర్తి ధర రూ.3.060(రూ.1.224లు రాయితీ పోను మిగిలిన ధర రూ.1.836లు రైతు వాటా), రెండు బస్తాలు పూర్తి ధర రూ.6.120లు (రూ.2448 లు రాయితీ పోను మిగిలిన రూ.3.672లు రైతు వాటా), మూడు బస్తాలు పూర్తి ధర రూ.9.180లు ( రూ.3,672 రాయితీ పోను మిగిలిన రూ.5,508 రైతు వాటా)గా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## బాల సదనంకు దరఖాస్తులు ఆహ్వానం

**బత్తలపల్లి, జూన్ 3 ప్రభాతవార్త**



సిడిపిఓ సరస్వతి

మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహం, బాల సదనంకు దరఖాస్తులు. చేసుకోవాలని బత్తలపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సరస్వతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని ఆడపిల్లలు, తల్లిదండ్రులలో ఒకరు ఉండి మరొకరు లేని ఆడపిల్లలు, నిరుపేద కుటుంబాల ఆడపిల్లలు కొరకు ఈ బాల సదనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ చదివే పిల్లలకు ఉచిత విద్య, ట్యూషన్, ఆహ్లాదకరమైన వాతావరణం, ఆటలు, లైబ్రరీ, మెను ప్రకారం మంచి భోజనం, వసతి కల్పించబడుతుందన్నారు. అన్ని కులములు. అన్ని మతములు వారికి ప్రవేశం ఉందన్నారు. 6 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. ఇందులో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువు చెప్పబడుతుందన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని. తక్కువ సీట్లు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు సూపరింటెండ్. ఎల్పి సర్కిల్, సిద్దార్థ సినిమా హాల్ ప్రక్కన, ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్ ఎదురుగా, సిద్దయ్యగుట్ట, ధర్మవరం. స్టాఫ్ 738611833, 7075633900, 9849438158, 9573275900 నెంబర్లులో సంప్రదించాలన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## గ్రామమును స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలి

డి యల్ పి ఓ విజయ్ కుమార్.



గ్రామంలో చెత్తను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, జూన్ 03 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామం ను స్వచ్ఛ గ్రామంగా తీర్చి దిద్దలని పంచాయతీ అభివృద్ధి అధికారి వర్ల శంకర్ కు డి యల్ పి ఓ విజయ్ కుమార్ తెలిపారు.బుధవారం పంచాయతీలో స్వచ్ఛ పథం కార్యక్రమానికి పంచాయతీ అభివృద్ధి అధికారి వర్ల శంకర్ చేపట్టి టీవీ టవర్ సమీపంలో హైవే రోడ్డుకు ఇరువైపులా గల రోడ్లపై ఉన్న చెత్తను పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమానికి డి యల్ పి ఓ విజయ్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగాతీర్చిదిద్దాలని, అదే విదంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డి ఎల్ పి ఓ విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి: డాక్టర్ హారి

**తాడిమర్రి జూన్ 3 (ప్రభాతవార్త)**



డాక్టర్ హారిత

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు(గురువారం) జిల్లా అందత్వనివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని కంటి చూపు సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ హారిత, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఊరుకుందప్ప తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే కంటి పరీక్షలలో ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి ఉచిత బస్సులో పెనుగొండకు తీసుకువెళ్లి శుక్రవారం నవ్య శ్రీ కంటి ఆసుపత్రిలోఆపరేషన్లు చేయించడం జరుగుతుందని అన్నారు.అనంతరం శనివారంవారిని సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చడం జరుగుతుందని అన్నారు. కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శేషతల్పఅలంకారం శ్రీ అవధూత ఎర్రితాత స్వామి



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

**బెలుగుప్ప,జూన్ 3,ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేం ద్రంలో. అవ ధూత శ్రీ ఎర్రి తాత ఆరాధ నోత్సవం. భాగము లో స్వామి వారికి 8గంటల అభిషేకాలు బిల్వార్చన పల్లకి సేవ సాయంత్రం 4గంటల స్వామి శేష తల్పఅలంకారం లో పవిత్ర దర్శనం ఆలయ అర్చనలు చేసి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనస్వామి దర్శనచేసుకొని మెక్కలు తీర్చుకున్నారు ఆలయంలో వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు రాత్రి పదిగంటలకు స్వామివారి రథాన్ని పూరి వీధుల గుండా ఊరేగింపు కార్యక్రమము నిర్వహిస్తారు.

# ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం




జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూన్ 3 ప్రభాతవార్త

భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్, ప్రగతి పదం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఏడ్యూకేషనల్ సొసైటీ, స్పోర్ట్స్ అతారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ ప్రోగ్రాం ఇంచార్జి జి.శ్రీనివాసులు, మై భారత్ కో ఆర్డినేటర్ బిసాతి భరత్, ఎస్సార్ ఏడ్యూకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, మా అసోసియేషన్ మెంబర్ సుధాకర్, మార్కెట్ యార్డ్ మెంబర్ శ్రీధర్, సాప్ మెంబర్ అనిల్ కుమార్, అన్సెట్ ఇంచార్జ్ మేనేజర్ సి.శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కె.జయ మారుతి. పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలి అని పేర్కొన్నారు. సైకిల్ తొక్కడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. శారీరకంగా ఆరోగ్యం, దృడంగా ఉంటారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జి. నాగ శివ,మహేంద్ర, పి.గోపి, ఎస్ బాలాజీ, మరియు యువతీ యువకులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

## - ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నేతలు




నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 3 ప్రభాతవార్త

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఈ సందర్భంగా వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గిరి మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్య వ్యాపారం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని దేశవ్యాప్తంగా అనేక మైనటువంటి ప్రముఖ పరీక్షలు సందర్భంగా పేపర్ లీకేజీ వ్యవహారం ప్రారంభిస్తుంది ఇప్పటికే దేశవ్యాప్తంగా గత పది సంవత్సరాల కాలంలో 29 పరీక్ష పేపర్లు లీక్ కావడం జరిగిందన్నారు. ఇది కేవలం సెంట్రల్ యూనివర్సిటీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి లాబింగ్ వ్యవహారాల నిర్వ హించుకోవడం కోసం వారి అవినీతి అక్రమాలు జోబులు నింపుకోవడం కోసం సియుటియు యూజీ పరీక్షను రద్దు చేయడం జరిగిందన్నారు. వెంటనే సియుఈటి యూజీ ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహించాలని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు భీమేష్, నగర ఉపా ధ్యక్షులు వంశీ, నగర నాయకులు మహేష్, పరమేష్, గణేష్, సంతోష్, మోహన్, బాలు, నందు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# కె.అనురాధకి ఘనంగా పదవి విరమణ సన్మాన సభ



పదవీ విరమణ పొందిన అనురాధని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూన్ 3 ప్రభాతవార్త

అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని సర్వేపల్లి నగరపాలక మోడల్ ప్రాథమిక పాఠశాలలో పిఎస్‌హెచ్ ఎంగా పని చేసిన కె.అనురాధ మే 31వ తారీఖున పదవి విరమణ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం ఆమెకి సన్మాన సభని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు ఫణి భూషణ్ అధ్యక్షత వహిస్తూ అనురాధ విద్యారంగంలో ఆమె చేసిన కృషిని, సహా సిబ్బందితో ఉన్న స్నేహ భావాన్ని, ఆమెకు సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా డిఇఓ శ్రీనివాస రావు, ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నీలూరు రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు, నేతాజీ ఉన్నత పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు డిబిఎస్ ప్రకాష్ రావులు అనురాధ సేవలను ఆమె విద్య కోసం కృషిచేసిన పలు సందర్భాలను సమాజం పట్ల ఆమెకు ఉన్న నిబద్ధతను తెలియజేశారు. నిత్య సురభి ట్రస్ట్ చైర్మన్ నిర్మల కూడా అనురాధ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నగరంలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయినిలు మేడంతో వారికున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర నాయకులు రాజశేఖర్, మురళీకృష్ణ, మల్లికార్జున, విరూపాక్షగౌడ, జనార్ధన, రాజన్న, ప్రభాకర్, ఆర్‌కె. నాయుడు, ఏపీటీఎఫ్ నాయకులు ఓబులేష్, టిఎన్ యుఎస్ నాయకులు నాగభూషణం నాయుడు, ఏపీటి ఎఫ్ నారాయణ నాయక్, గంగాధర్ ఇతర సంఘాల నాయకులు వివిధ పాఠశాలల ఉపాధ్యాయ ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

# గుండెపోటుతో ఎంపీటీసీ సభ్యురాలు నీలాబాయి మృతి

## - నివాళులు అర్పించిన వైసీపీ నేతలు



.నీలాబాయి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం.

పామిడి, జూన్ 03 ప్రభాతవార్త

మండల పరిదిలోని పాళ్యంతండా ఎంపీటీసీ సభ్యురాలు నీలాబాయి (35) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. నీలాబాయి వెంకటేష్‌నాయక్ దంపతులు వజ్రకరూర్‌లో నివాసం ఉంటున్నారని అర్ధరాత్రి ఆమెకు చాతీలో నొప్పి రావటంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా పరీంక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు మృతురాలి బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైసీపీ రాష్ట్ర కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మధుసూ దన్‌రెడ్డి, మాజీ కన్వీనర్లు పాళ్యం నారాయణరెడ్డి, జోజోడే కుమార్, రూరల్ ఉపాధ్యక్షులు నీలూరు హరినాథ్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాళ్యం తండా గ్రామానికి నీలాబాయి మృతదేహానికి నివాళులు అర్పించిన అనంతరం మృతురాలి భర్త వెంకటేష్ నాయక్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆందోళన చెందవద్దని ధైర్యంగా ఉండాలని మేమంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలుగా నీలాబాయి ప్రజాసమ స్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీకి ఎనలేని సేవలు అందించిందని కొనియాడుతూ ఆమె మృతి పార్టీకి తీరనిలోటని వారు వెల్లడించారు.

# అంగన్వాడి బడి పిలుస్తుంది రండి !



అంగన్వాడి బడి పిలుస్తోంది కార్యక్రమాన్నినిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు, జూన్ 3 ప్రభాతవార్త

బడి బయట ఏ చిన్నారీ ఉండకూడదన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో, ఐదేళ్లు పూర్తి చేసుకున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా మహిళా శిశు సంక్షేమశాఖ వరిమడుగు అంగన్వాడి కార్యకర్త సుజాత ఆధ్వర్యంలో జూన్ 1 నుంచి 20 వరకు అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వారిమడుగు గ్రామంలో క్లస్టర్ల పరిధిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం పండగలా నిర్వహించారు. అదే విధంగా ఈనెల 20 వరకు ఇంటింటికీ వెళ్లి గర్బి ణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పిస్తా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు. తద్వారా కేంద్రాల్లో ప్రవేశాల సంఖ్య పెంచనున్నారు. అంగన్వాడీల్లో చేరితే అటు ఆరోగ్యం, ఇటు చదువు అందిస్తామనే విషయాన్ని ప్రధా నంగా వారికి వివరించారు. ఈనెల 20 వరకు ఇంటిం టికీ వెళ్లి గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పిస్తారు. తద్వారా కేంద్రాల్లో ప్రవేశాల సంఖ్య పెంచనున్నారు. అంగన్వాడీల్లో చేరితే అటు ఆరోగ్య ం.. ఇటు చదువు అందిస్తామనే విషయాన్ని ప్రధానంగా వారికి వివరిస్తారు. చిన్నారులకు రోజూ 100మి.లీ పా లు, ఉడికించిన గుడ్డు, మధ్యాహ్న భోజనం మూడు, నాలుగేళ్ల పిల్లలకు పీపీ1, పీపీ2 స్థాయిలో తెలుగు, ఆంగ్లం, గణితం తదితర పాఠ్యాంశాలను బోధించ నున్నారు. చిన్నారులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా అంగన్వాడీ కేంద్రాలు వచ్చేటట్లు చేయడమే ఈ కార్యక్ర మ ప్రధాన లక్ష్యమని అంగన్వాడి కార్యకర్త సుజా త తెలి పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త సుజాత, పిల్లలు బాలింతలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం - ఎంపీడీఓ తేజోష్ణ

## - అంబేద్కర్ కాలనీలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన



.చెత్తకుప్పలు, వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం.

పామిడి, జూన్ 03 ప్రభాతవార్త

ఆరోగ్యమే మహాభాగ్యం అని ఎంపీడీఓ తేజోష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వచ్ఛ పథం' కార్యక్రమంలో బాగంగా బుధవారం జాతీయ రహదారి ప్రక్కనున్న అంబేద్కర్ కాలనీలో వ్యర్థాలను, చెత్తకుప్పలను తొలగిస్తూ పరిసరాల పరిశుభ్రతపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ తేజష్ణ మాట్లా డుతూ ప్రజారోగ్యాలు, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవితాలను గడపవచ్చని తెలియజేశారు. గృహాల వద్దనే తడిచెత్త పొడిచెత్తను వేరు చేయటం ద్వార కలిగే ప్రయోజనాలను వివరిస్తూ పొడిచెత్తను స్వచ్ఛ రథంకు అందించి నిత్యవసర సరుకులను పొందాలని సూచించారు. పరిశుభ్రతను పెంపొందించటం మనందరి బాధ్యత అంటూ స్వచ్ఛ గ్రామం ప్లాస్టిక్ రహిత గ్రామం గ్రీన్ ఆంధ్ర లక్షసాధనలో ప్రతిఒక్కరూ బాగస్వాములై ప్రభుత్వ లక్ష్యాన్ని ముందకు తీసుకెళ్ళాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రంగనాయకులు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్స్ ఖాజామొయినుద్దీన్, రవి, శానిటరీ మేస్త్రీ సురేష్, పంచాయతీ సచివాలయాల సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్న గది సీజ్




సీజ్ చేసిన గదిని చూపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం న్యూటౌన్, జూన్ 3 ప్రభాతవార్త

అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్న పాఠశాల పుస్తకాలు గదిని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం సీజ్ చేయించారు. ఈ సందర్భంగా పిఎస్ఫ్, రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ ఆలం, ఎఐఎస్‌పి రాష్ట్ర అధ్యక్షు లు నరసింహా, పిఎస్ఫ్, జిల్లా కార్యదర్శి ప్రతిభ భారతి, యు ఎస్ ఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్ మాట్లాడుతూ.. అనంతపురం రాచనపల్లిలో ఉన్న సంసిద్ సిబిఎస్ఈ పాఠశాల వారు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పుస్తకాలు పేరుతో విద్యార్థుల తల్లిదం డ్రుల దగ్గర నుండి వేలకు వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. అదేవిద ంగా సంసిద్ధి పాఠశాలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు సాహిత్, చిన్న, విష్ణు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ జూన్ 2026

అనంతపురం న్యూటౌన్, జూన్ 3 ప్రభాతవార్త

స్థానిక అనంతపురం పట్టణం, కోర్టు రోడ్డులో గల ప్రభుత్వ బాలుర ఐ.టి.ఐ కళాశాల ఆధ్వర్యంలో 08-06-2026 ఉదయం 10.00 గంటలకు ఐ.టి.ఐ ప్రాంగణంలో ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిసిప్ మేళా (పిఎంఎన్ఐఎఎం), క్యాంపస్ రిక్రూట్ మెంట్ డ్రైవ్ జూన్ 2026 నిర్వహించారు. ఈ మేళాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐ.టి.ఐలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులతో పాటు, 2026 సంవత్సరంలో ఫైనల్ ఇయర్ పరీక్షలు రాస్తున్న మొదటి, రెండవ సంవత్సరం కోర్సుల ట్రైనీలు కూడా పాల్గొనవచ్చునని ప్రిన్సిపాల్ పి.రాయపురెడ్డి తెలిపారు. వివిధ ప్రముఖ కంపెనీలు అప్రెంటిషిప్, ఉద్యోగ అవకాశాలు, ముందస్తు ఉద్యోగ ఆఫర్ లెటర్లను అందజేయనున్నాంని తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి, ఐ.టి.ఐ మార్కుల మెమోలు, విగిది సర్టిఫికెట్, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్బుక్, రెండు ఫోటోలు తదితర ధృవపత్రాల మూడు సెట్లతో హాజరుకావాలని ఆయన తెలిపారు.

# పార్టీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

## - టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడు తు న్న టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్

కదిరి, జూన్ 3 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నాయకులతోపాటు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమం డ్ ఇర్ఫాన్ పిలుపుని చ్చారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కందికుంట ఆదేశాల మేరకు ము న్సిపల్ పరిధిలోని 26వ యూ నిట్‌లో తెలుగుదేశం పార్టీ కార్యక ర్తల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డైమండ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్ర మాలపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై పార్టీ నాయకులు నిరంతరం అందు బాటులో ఉండి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రవ ంం లో యూని ట్ ఇన్‌చార్జ్ మన్సూర్, ఖాదర్‌బాషా, అస్లాం, రాయుడు, జమీల్, జమీర్, షాకీర్, కిరణ్, ఐటిడిపి నాయకులు, జెఎస్.మన్సూర్‌లు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

## - జిల్లా హౌసింగ్ పిడి శైలజా



శింగనమల, జూన్ 3 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా పిఎం ఆవాస్ యోజన పథకం కింద నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ పిడి శైలజా పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో పిఎం ఆవాస్ యోజన 2.0 పథకం కింద నిర్మిస్తున్న పథకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె లబ్దిదారులతో మాట్లాడుతూ.. గృహ నిర్మాణాలను ప్రభుత్వం నిర్దేశించిన కొలతల మేరకే నిర్మించుకోవాలని ఎక్కువ పొడవు, వెడల్పు నిర్మించుకుంటే లబ్దిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఆమె వెంట హౌసింగ్ డిఈ రామ్మూర్తి, ఏఈ శశికళ, వర్క్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.

# వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి సాకే శైలజానాథ్



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ మంత్రి సాకే శైలజానాథ్

శింగనమల, జూన్ 3 ప్రభాతవార్త

తాడేపల్లిలోని వైఎస్ఆర్‌సిపి కేంద్ర కార్యాలయంలో బుధ వారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వ య కర్త సాకే శైలజానాథ్, మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి ఇద్దరి మధ్య నియోజకవర్గంకు సంబంధించిన అంశాలుచర్చకు వచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు ఆయన తెలిపారు.

# వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రమణారెడ్డి



ఎస్ఎంఎల్07 : వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో శివపురం రమణారెడ్డి

శింగనమల, జూన్ 3 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లి ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో మండల పరిధిలోని శివపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి యూత్ నాయకుడు రమణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశాడు. ఆయనతోపాటు నాయినవారిపల్లి లక్ష్మిరంగయ్య, శివపురం అంజినమ్మ, వడ్డే పెద్దక్క తదితరులు ఉన్నారు.

# దాడి కేసులో నిందితులు అరెస్ట్



అదుపులోకి తీసుకున్న నిందితులను చూపుతున్న సిఐ

తాడిపత్రిఅర్బన్, జూన్ 3 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని సూర్య పవన్ లాడ్జ్‌లో పనిచేస్తున్న మాధవ్ అనే వ్యక్తిపై మంగళవారం అర్ధరాత్రి దాడి చేసిన కేసులో ఇరువురు నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ ఆరోహణరావు తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ వివరాలు వెల్లడించారు. మాధవ్‌పై దాడి చేసిన కేసుకు సంబంధించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టి దాడికి పాల్పడిన గాండ్లపాడు వినయ్, షేక్ హాజీబాషాలను బుధవారం మధ్యాహ్నం తాడిపత్రి పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయం సమీపంలో అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. నిందితులకు నిర్వహించిన గంజాయి వినియోగ పరీక్షల్లో ఇద్దరికీ పాజిటివ్ వచ్చిందని, గంజాయి మత్తులోనే లాడ్జ్‌లో పనిచేస్తున్న మాధవ్‌పై దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తూ నేరాలకు పాల్పడుతున్నందున భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు నిందితులపై రౌడీషీట్ నమోదు చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

# ప్రతి ఒక్కరు రహదారి భద్రత నిబంధనలను పాటించాలి

## - రవాణా శాఖ అధికారి వరప్రసాద్



ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రవాణా శాఖ అధికారి వరప్రసాద్

కదిరి, జూన్ 3 ప్రభాతవార్త

ప్రతి ఒక్కరు రహదారి భద్రత నిబంధనలను పాటించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చని రవాణా శాఖ అధికారి వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కదిరిలో స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రవాణా శాఖ అధికారి వరప్రసాద్, గౌరవాధ్యక్షులు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె దేవానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి వర ప్రసాద్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నిబంధనలపై, ట్రాఫిక్ నిబంధనలపై క్షేత్రస్థాయిలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ఖాదర్‌బాషా, ఖాసీం, ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు



అగ్ని ప్రమాదాలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కదిరి, జూన్ 3 ప్రభాతవార్త

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలోని రిషితా చిల్డ్రన్స్ వైద్య శాలలో అగ్ని మాపక శాఖ అధికారి కె.మాబుసుబహాన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫైర్స్, గ్యాస్ ఫైర్స్, ఎలక్ట్రికల్ ఫైర్స్ వంటి వివిధ రకాల అగ్ని ప్రమాదాల గురించి వైద్య శాలకు విచ్చేసిన ప్రజలకు, వైద్య సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో ఎలా స్పందించాలి, ఎలాంటి భద్రత చర్యలు తీసుకోవాలి అన్న అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించి ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది దేవ్లానాయక్, హరినాథ్, రవి, అంజినప్ప, నాగరాజు, రమేష్, వైద్య శాల నిర్వాహకులు డా.మధన్‌కుమార్, వైద్య శాల సిబ్బంది పాల్గొన్నారు.

# వడదెబ్బతో గొర్రెలకాపరి మృతి



మృతి చెందిన గొర్రెల కాపరి బాలక్రిష్ణ ఫైల్‌ఫోటో

బుక్కరాయసముద్రం జూన్ 3 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని భద్రంపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపారి చెరుకూరి బాలక్రిష్ణ (40) తండ్రి వెంకటరాముదు,గొర్రెలను కాసుకుంటూ జీవనం సాగించేవారు దినచర్యలో భాగంగా బుదవారం గొర్రెలను మేపుకుంటు ఉండగా ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఒక్కసారిగా ఉన్నట్లు ఉండి చెరుకూరి బాలక్రిష్ణ కుప్పకూలి కిందకు పడిపోయాడు వాటిని గమనించిన తోటి గొర్రెల కాపార్లు బాలక్రిష్ణ ను అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు.వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.మృతునికి భార్య సరస్వతి తోపాటు ఇద్దరు ఆడపిల్లలు ఒక మగపిల్లవాడు ఉన్నారు.

కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడ ంతో ఆ కుటుంబం దుఖ:సాగరంలో మునిగిపోయారు మృతుడు బాలక్రిష్ణ 8లక్షలవరకు అప్పుచేసి గొర్రెలను కొనుగోలు చేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుచున్నారు.

# రీ సర్వే పనులను వేగవంతం చేపట్టాలి

## - జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్



రీ సర్వే వివరాలను తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్



గ్రామ సచివాలయం తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

శింగనమల, జూన్ 3 ప్రభాతవార్త

రీ సర్వే పనులను వేగవంతంగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని కల్లుమడి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పరిశీలించారు. ఇందులో గ్రౌండ్-2 ట్రూ కింగ్, ఇకెవైసి పనులను క్షేత్రస్థాయి కొలతలను తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ..రీ సర్వే పనులు నిర్దేశించిన సమయంలోపు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని రాచేపల్లి గ్రామం వద్ద లీడ్ క్యాప్ ఏర్పాటుకు సంబంధించి భూముల విషయమై జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. తదనంతరం సి.బండమీదపల్లి స్వర్ణగ్రామ సచివాలయాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాధాన్యత ప్రకారం ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శేషారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, లీడ్‌క్యాప్ ఈడి రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు నారాయణ స్వామి, పంచాయితీ కార్యదర్శి స్నేహ, విఆర్ఓ విరుపాక్షరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

# ముస్లిం స్మశాన వాటికలో ఎల్ఈడి బల్బులు ఏర్పాటు



ఎల్ఈడి బల్బులు అందజేస్తున్న ఎంపిడిఓ భాస్కర్

శింగనమల, జూన్ 3 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ముస్లిం స్మశాన వాటికలో బల్బులు లేక చీకటిగా ఉండటంతో ముస్లింలు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ముస్లిం స్మశాన వాటికలో ఐదు ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఓ, శింగనమల గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ముస్లిం స్మశాన వాటికను సందర్శించి ముస్లిం పెద్దలకు ఎల్ఈడి బల్బులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి తిప్పేస్వామి, ముస్లిం పెద్దలు మసూద్‌వలి (అలియాజ్ మొద్దు), చిట్టి, మసూద్ వలి, మాసుల్ ప్రకాష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు ఉల్లికల్లు చిన్న పెద్దన్నకు ఘన సన్మానం



ఉల్లికల్లు చిన్న పెద్దన్నను సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల, జూన్ 3 ప్రభాతవార్త

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉల్లికల్లు చిన్న పెద్దన్నను ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల జేఏసి రాష్ట్ర చైర్మన్ డి.రవిరాజ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ గౌరవాధ్యక్షులు చెన్నంపల్లి ఓబులేసు, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు యు.రమణ, మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నగేష్, ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల జేఏసి పెద్దరాజు, రామకృష్ణ, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I S. GAFOOR [illegible] [illegible] Sound Talkies DHARMAVARAM 515671, SRI SATYASAI DIST, A.P. Have Changed My Surname as SHAIK GAFOOR SAB Hereafter my name is known as SHAIK GAFOOR SAB (New Name).

04ATP03.qxd:04ATP03.qxd 04/06/26 11:29 PM Page 1



# ప్రదాన రస్తా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి
## - కలెక్టర్‌ను కోరిన బిజెపి రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి

అనంతపురం సిటీ, జూన్ 3 ప్రభాతవార్త

గ్రామ చెరువుతోపాటు పొలాలకు వెళ్లే ప్రధాన రస్తాను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని రస్తాను యదావిధిగా కొనసాగించాలని బిజెపి సెల్స్ రాష్ట్ర కన్వీనర్ చిరంజీవిరెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను రైతులతో కలిసి బిజెపి నేత చిరంజీవిరెడ్డి వినతిపత్రం అందించారు. అనంతపురంరూరల్ మండల పరిధిలోని కొడిమి గ్రామంలో సర్వే నెంబర్ 178-4ఈ-1ఈలో 2.79 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఈ స్థలం మొత్తం కొడిమి గ్రామ చెరువుకు వెళ్లేప్రధాన రస్తా అని దాని పక్కనే దాదాపు 8 అడుగుల కాలువ సైతం ఉందన్నారు. అయితే ఈ స్థలాన్ని కొడిమికి చెందిన లక్ష్మిరెడ్డి ఆక్రమించి చెరువుకు వెళ్లేందుకు దారిని సైతం వదలడం లేదనా న్నరు. రైతులు ప్రశ్నిస్తే తనకు పట్టా ఉందని, బెదిరిస్తున్నారని సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామస్తులు కోరితే ఎవరికి దానిని పట్టా ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారన్నారు. గ్రామంలో భూములు ఉన్న వ్యక్తికి,నిరు పేదలకు అందించే డి పట్టా ఇచ్చే అవకాశం లేదని, వీటిపై విచారణ జరిపించి చెరువు రస్తాను కబ్జా నుంచి కాపాడి రైతులకు పొలాలకు వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమగ్ర విచారణ జరిపిస్తామని భరో సా ఇచ్చారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతులు నాగార్జున, రాజశేఖర్, నారాయణ, సూరి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బిజెపి నేత చిరంజీవిరెడ్డి

# కష్టపడే ప్రతి ఒక్కరికి పదవులలో ప్రాధాన్యత కల్పిస్తున్నాం
## - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, జూన్ 3 ప్రభాతవార్త

వైఎస్‌ఆర్‌సిపిలో కష్టపడే ప్రతి ఒక్కరికీ పదవులలో ప్రాధాన్యత కల్పిస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నారాయణపురంకు చెందిన సత్యనారాయణ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని తన నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీలో ప్రాధాన్యత కల్పించారని, రైతు సమస్యలపై పోరాడుతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. కూటమి పాలనలో రైతులకు జరుగుతున్న అన్యాయంపై విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నేతలు ఉమ్మడి జగన్‌మోహన్‌రెడ్డి, రామసు బ్బారెడ్డి, ఉమ్మడి మధన్ మోహన్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, మల్లెల వేణు గోపాల్, బళ్లారి లక్ష్మినారాయణ, జాఫర్, పసుపు లేటి రవి, సుబ్బారెడ్డి, లింగారెడ్డి, గుజ్జల సురేష్, అమర్‌నాథ్‌రెడ్డి, సుధాకర్, మహ్మద్, చిన్నబాబయ్య, సాకే అశోక్‌కుమార్, సూర్యనారాయణరెడ్డి, నాగార్జున, నాగేశ్వర్‌రెడ్డి, నరేష్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



అనంతకు పుష్పగుచ్చం అందిస్తున్న రైతు విభాగం తాడిపత్రి సత్యనారాయణ

# కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది
## - సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరా రెడ్డి

మడకశిర టౌన్ జూన్ 3 ప్రభాతవార్త.

కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది అని బిజెపి ప్రభుత్వంపై సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరా రెడ్డి మండిపడ్డారు. బుధవారం మండల పరిధిలోని తన స్వగ్రామం నీలకంఠా పురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సి డబ్ల్యు సి మెంబర్ రఘువీరారెడ్డి మాట్లాడుతూ మోదీ హయాంలో వివాదాలు, పేపర్ లీకులకు పర్యాయపదా లుగా మారిన జాతీయ పరీక్షలు అని తెలిపారు. నీట్, యుజీసీ, సిబిఎస్‌సి పరీక్షల్లో వరుస వైఫల్యాలపై మాజీ మంత్రి రఘువీరారెడ్డి బిజెపి ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంద ఆయన పేర్కొన్నారు.

పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు ఎదురవుతున్నా బాధ్యులపై చర్యలు శూన్యం అని అన్నారు. రాహుల్ గాంధీ అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్న కేంద్ర ప్రభుత్వం ప్రశ్నలకు పెదవి విప్పి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కే ంద్రంలో పారదర్శకత, జవాబుదారీతనం లేదు అన్నారు. కేవలం ప్రచారమే సాగుతోంది అని తెలిపారు.పేపర్ లీక్ అంటే పరీక్ష రద్దు కాదు అని లక్షలాది కుటుంబాల ఆశలను ఛిద్రం చేశారన్నారు. విద్యార్థులకు కావాల్సింది సాకులు కాదు అని న్యాయం, పార దర్శకత అని తెలిపారు. కేవలం ఎన్ టి ఏ అధికారులను మార్చితే సరిపోదు అని వైఫల్యాలకు కేంద్రానిదే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వం వహించాలని డి మాండ్ చేశారు.కేంద్ర వి ద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీ నామా చేయాలి ఆయన డిమాండ్ చేశారు. మంత్రి రాజీ నామా చేయకుం టే ప్రధాని మోదీ ఆయన్ను క్యాబినెట్ నుంచి తొలగిం చాలి అని ఆయన కోరారు. దేశ యువత భవిష్య త్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడటం ఎంతవ రకు సమంజసం అని ప్రశ్నించారు.పేపర్ లీకులు ఆగాలి అని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు బ్రేకులు వేస్తున్న ప్రభుత్వ వైఫల్యాలు ముగియాలి అని తెలిపారు.



బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డ సి డబ్ల్యూ సి మెంబర్ రఘువీరారెడ్డి

# మీ భూమి మీ హక్కు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ
### మండల పరిధిలోని పలు సమస్యలపై ఆరా తీసిన కలెక్టర్ -సూర్య ఘర్ ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోండి -ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్క రైతు వారి పొలంలో నీటి కుంటను ఏర్పాటు చేసుకోండి. కలెక్టర్ శ్యాంప్రసాద్.

రొద్దం. జూన్ 3 ప్రభాత వార్త.

మండల పరిధిలోని రొద్దకంపల్లి గ్రామంలో మీ భూమిమీ హక్కు కార్యక్రమంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి కలెక్టర్ శ్యాంప్రసాద్ ఎన్ డి ఏ కూటమి నాయకులు గ్రామస్తులు రైతులు పాల్గొనగా రీ సర్వేలో రెవెన్యూ అధికారులు ఎక్కడ సమస్యలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్క రైతుకు పాసు పుస్తకాలు పంపిణీ చేయగా అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రి సర్వేలో రెవెన్యూ అధికారులు చాలా జాగ్రత్తగా రైతుల సమక్షంలో భూ సర్వే చేసి పాసు పుస్తకాలు మీకు అందజేయడం జరిగిందని ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని మండలంలో ఇంకా పలు సమస్యలపై ఆరాధిస్తూ వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా వారి వారి పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకొని వారి భూమిలోనే నీరు ఇంకిపోయే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కూలికి పని దొరుకుతుందని తెలియజేస్తూ చెరువుల మరమ్మత్తులకు ప్రణాళికలు సిద్ధం చేసామని వాటిని కూడా తొందరలోనే పూర్తి చేస్తామని చెరువులోకి నీరు వృధా కాకుండా ఎక్కడికక్కడ పూడికలు తీసి ఎగువ నుండి నీరు వచ్చే విధంగా ఆయా గ్రామాల చెరువుల్లో పనులు పూర్తి చేశారని రుద్దం పెద్ద చెరువు మరువ పనులను త్వరలోనే చేపడతామని తెలియజేశాడు చెరువుగట్లపై కంపచెట్లు తొలగించి చిన్న చెరువు తూముల నుండి నీరు సక్రమంగా వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సిద్ధన్న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఇరిగేషన్ డి ఈ వినోద్‌ను వివరాలు అడిగి తెలుసుకుని తొందరలోనే పనులు చేపడతామని తెలియజేశాడు అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో బెల్ కంపె నీ ఆధ్వర్యంలో ఆరు కోట్ల రూపాయలు నిధులు మం జూరు అయ్యాయని అక్కడి పనులను పరిశీలించడం జరిగింది. అంతేకా కుండా ఎం జె బి స్కూల్ విద్యార్థులకు సరైన గదు లు వసతులు లేవని తెదేపా నాయకులు తెలియజే యడంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎం జె బి స్కూల్ గదు లను పరిశీలించి అక్కడి గుత్తేదారులను త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించాడు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే సకాలంలో పనులు పూర్తి చేస్తామని కలెక్టర్ తెలియజేశాడు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాధవ నాయుడు చిన్నపయ్య నరసింహులు వెంకటరామిరెడ్డి మారెప్ప ఆదిశేషు నాగరాజు కదిరప్ప అధికారులు ఎంపీడీవో ఆనంద ప్రసాద్ తాసిల్దార్ సిబ్బంది పోలీస్ సిబ్బంది గ్రామస్తులు రైతులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



కలెక్టర్ శ్యాంప్రసాద్

# ప్రజా ముంగిట ఏఐప్రజావాణి ప్రారంభించిన జిల్లా ఎస్పీ

అనంతపురం క్రైమ్ జూన్ 3 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారంలో సరికొత్త సాంకేతికతను జోడిస్తూ, పారదర్శకమైన డిజిటల్ పాలనే లక్ష్యంగా అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. బాధితులు తమ ఫిర్యాదులను మరింత సులభంగా, త్వరితగతిన సమర్పించేలా రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వాయిస్ కంప్లైంట్ రిజిస్ట్రేషన్ సిస్టమ్‌తి। ప్రజావాణిను జిల్లా ఎస్పీ గారు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారికంగా ప్రారంభించారు. జిల్లా ఎస్పీ, ట్రైనీ ఐపిఎస్ అధికారి అశ్విన్ మణిదీప్ తో కలిసి ఈ నూతన విధానాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఫిర్యాదుదారులు ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ సమస్యను నోటి మాట ద్వారా నేరుగా చెబితే, ఈ వ్యవస్థ ఆ వాయిస్‌ను ఆటోమేటిక్‌గా లిఖితపూర్వక ఫిర్యాదుగా మారుస్తుంది. మాట్లాడిన ఫిర్యాదును కంప్యూటర్ సిస్టమ్ ఒక క్రమ పద్ధతిలో తయారు చేసి, తక్షణమే ప్రింట్ కాపీని బాధితులకు అందిస్తుంది. బాధితులకు ప్రింటెడ్ కాపీనీ అందజేయడంతో పాటు సదరు పిటీషన్ జిల్లా ఎస్పీ ముంగిటకు వెళ్లి అక్కడే పరిష్కారానికి నోచుకుంటుంది ఫిర్యాదులు సొంతంగా రాసుకోలేని వారికి, అర్జీలు రాయించుకోవడానికి ఇతరులపై ఆధారపడే వారికి ఈ వ్యవస్థ ఎంతో మేలు చేస్తుంది. పైగా అర్జీలు రాసిచ్చే వారి వద్దకు వెళ్లాల్సి న పని లేదు. దీనివల్ల సమయం ఆదా కావడం మరియు కొంతవరకు ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రస్తుతం జిల్లా పోలీసుకార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ వద్ద ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. భవిష్యత్తులో ఈ వ్యవస్థను జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో అమలు చేయనున్నట్లు ఎస్పీ వెల్లడిం చారు. ఎస్పీ మాట్లాడుతూ సాంకేతికతను ప్రజా సేవకు అనుసంధానించ డంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. ఈ ఖిఖితి। ప్రజావాణిఖిఖి ద్వారా బాధి తులకు, పోలీసులకు మధ్య దూరం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫిర్యాదుల నమోదులో పారదర్శకతను పెంచేందుకు, సామాన్య ప్రజలకు పోలీస్ సేవలను మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను నేరుగా తమ స్వరంతో ఎస్పీ కార్యాలయానికి తెలియజేయవచ్చు. ఫిర్యాదుదారు చెప్పిన విషయాలను ఏఐ సాంకేతికత స్వయంచాలకంగా లిఖిత రూపంలోకి మార్చి, పూర్తి ఫిర్యాదు పత్రాన్ని తయారు చేసి వెంటనే ప్రింట్ కాపీని అందిస్తుందన్నారు. దీంతో ఫిర్యాదు రాయలేని వారు, అక్షరాస్యత తక్కువగా ఉన్న వారు కూడా సులభంగా తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రజా సేవలలో కృత్రిమ మేధస్సు వినియోగానికి నాంది పలుకుతూ, జిల్లా పోలీసు శాఖలో సాంకేతిక ఆధారిత ప్రజా సేవలకు ఈ కార్యక్రమం ఒక కొత్త మైలురాయిగా నిలవనుందన్నారు.



ప్రజా ముంగిట ఏఐప్రజావాణి ప్రారంభించిన జిల్లా ఎస్పీ

# విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూన్ 3 ప్రభాతవార్త

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజయవాడ కనక దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం ఉదయం ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి వెళ్లారు.



విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని వస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులు





వేదపండితులు, ఆలయ అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం మల్లేశ్వరస్వామిని కూడా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. దుర్గమ్మ, మల్లేశ్వరస్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి రైతులందరు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.

# నేషనల్ క్లీన్ ఎయిర్ పోగ్రామ్ కింద 15 రోజుల్లోగా పనులు గ్రౌండ్ కావాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ జూన్ 03 ప్రభాతవార్త

నగరపాలక సంస్థ పరిధిలో నేషనల్ క్లీన్ ఎయిర్ పోగ్రామ్ కింద 15 రోజుల్లోగా పనులు గ్రౌండ్ కావాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నేషనల్ క్లీన్ ఎయిర్ పోగ్రామ్ పనులపై నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ క్లీన్ ఎయిర్ పోగ్రామ్ కింద నిబంధనల మేరకు డిజైన్‌లను వెంటనే పూర్తి చేసి పనులు మొదలు పెట్టాల న్నారు. ఇందులో అలసత్వం ఉంటే చర్యలు తీసుకుంటా మన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ పోగ్రామ్ కింద వచ్చే ఆగస్టు 15 నాటికి అన్ని రకాల పనులు పూర్తి అయ్యే లా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎస్ ఈ రాజశేఖర్, ఈఈ షాకి ర్, ఇంజనీ రింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కావాలి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ జూన్ 03 ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాల యం,అనంతపురం ఆధ్వర్యంలో నిర్వహిం చనున్న కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన పోస్ట ర్లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

రాబోయే కార్యక్రమాలలో పౌరులు, విద్యా ర్థులు, విద్యాసంస్థలు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినో త్సవ కార్యక్రమాలలో ప్రజలు, విద్యార్థులు మరియు పర్యావరణ పరిరక్షణ సంస్థలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఏపీ పీసీబీ, జిల్లా అటవీ శాఖ సమన్వయంతో కలెక్టరేట్ నుం డి ఏ.ఎఫ్. ఎకాలజీ సెంటర్ వరకు పర్యావరణ అవగా హన ర్యాలీ మరియు ఈసైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఆంధ్రప్ర దేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాల యం పర్యావరణ ఇంజనీర్ శశికళ, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లో ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

# హోంగార్డు రఫిక్ బాషాకు ఆర్థిక సాయం అందించిన ఎస్పీ

అనంతపురం క్రైమ్ జూన్ 3 ప్రభాతవార్త

జిల్లాలో హోంగార్డుగా సుదీర్ఘ కాలం సేవలందించి పదవీ విరమణ పొందిన హోంగార్డు రఫిక్ బాషాకు జిల్లా ఎస్పీ జగదీష్ ఆర్థిక సాయం అందించారు.సాటి హోంగార్డులు అండగా నిలిచారు. తోటి ఉద్యోగి పట్ల జిల్లాలోని హోంగార్డులందరూ కలిసి సేకరించిన రూ. 4,96,290/ మొత్తాన్ని చెక్కు రూపంలో బుధవారం జిల్లా ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా రఫిక్ బాషాకు చెక్కు రూపంలో అందజేశారు. "పోలీస్ శాఖలో హోం గార్డుల సేవలు ఎంతో కీలకమైనవని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. విధి నిర్వహణలోనే కాకుండా, తోటి ఉద్యోగి పదవీ విరమణ చేసినప్పుడు వారందరూ కలిసి కట్టుగా స్పందించి ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందిం చడం అభినందనీ యమన్నారు. ఈ నిధులు రఫిక్ బాషా విశ్రాంత జీవితానికి, వారి కుటుంబ భవిష్యత్తుకు ఎంతో ఉపయో గపడతాయన్నారు. హోంగార్డుల మధ్య ఉన్న ఈ ఐక్యత, సేవాభావం అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఇన్చార్జి ఆర్ ఎస్ ఐ జాఫర్, హోంగార్డుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డుకు ఆర్థిక సాయం చెక్కును అందిస్తున్న జిల్లా ఎస్పీ

# చౌకధాన్యపు డిపోపై సంయుక్త కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
## - అవకతవకలకు పాల్పడినట్లు రుజువు కావడంతో 6-ఎ కేసు నమోదు
## - తరచూ చౌకధాన్యపు డిపోలను తనిఖీలు చేయాలని తహశీల్దార్లకు ఆదేశాలు

శింగనమల, జూన్ 3 ప్రభాతవార్త

శింగనమల మండలము పోతురాజు కాలువ గ్రామములోని చౌక ధరల దుకాణం నెం.1211024ను జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చౌక ధరల దుకాణములో గల నిత్యావసర సరుకులు భౌతిక నిల్వలు ఆన్లైన్ రిపోర్టుతో సరిపోల్చి చూడగా, 235 కేజీలు బియ్యము, 643 కేజీలు జొన్నలు తక్కువగా ఉన్నట్లు పరిశీలించారు. సరుకులను వ్యత్యాసముతో నడుపుట ఈసి యాక్ట్, 1955లోని 7 (1) నిబంధనల మేరకు నేరము అని తెలిపి, సదరు చౌక ధరల దుకాణ డీలర్ సి. శైలజ వైఫ్/ఆఫ్ మునిగోపాల్‌పై 6-ఎ కేసు నమోదు చేసి, చౌక ధరల దుకాణములో భౌతిక నిల్వలను, ఈపిఓఎస్ యంత్రమును, వేయింగ్ స్కేలును తదుపరి భద్రత నిమిత్తం యం.ఓబులపతి, గ్రామ రెవిన్యూ సహాయకులు, పోతురాజు కాలువ వారికి స్వాధీన పరిచారు. జిల్లాలో గల అందరు చౌక ధరల దుకాణ డీలర్లు నిత్యావసర సరుకుల పంపిణీ విషయంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. అదే విధముగా జిల్లాలో గల అందరు తహసిల్దార్లు, పౌర సరఫరాల డిప్యూటి తహసిల్దార్లు వారి పరిధిలో గల అన్ని చౌక ధరల దుకాణాలను తనిఖీ చేయుచూ నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమముగా జరుగునట్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో సంయుక్త కలెక్టరు వారి వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి టి.వెంకటేశ్వర్లు, తహసిల్దారు శేషా రెడ్డి, పౌర సరఫరాల డిప్యూటి తహసిల్దారు బి.యం.బాషా తదితరులు పాల్గొన్నారు.



చౌకధాన్యపు డిపోలను పరిశీలిస్తున్న సంయుక్త కలెక్టర్

# జనగణన ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలిడిప్యూటి కలెక్టర్

బుక్కరాయసముద్రం జూన్ 3 ప్రభాతవార్త

జనగణ ప్రక్రియను సక్రమంగా తప్పులు లేకుండ నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్ పద్మావతి అధికారులను ఆదేశించారు.బుదవారం బుక్కరాయసముద్రం మండల తహశీల్దార్ కార్యాలయంలో సంబందిత అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండ చూడాలన్నారు.ఈ సమీక్ష సమా వేశంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు,డిప్యూటీ ఎంపీడివొ సదాశివ,జనగణకు సంబందించిన సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్,వివిధశాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



జనగణ ప్రక్రియ సమీక్ష సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్ పద్మావతి

# సీఎంను కలిసిన అనంత ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం,

క్రైమ్ జూన్ 3 ప్రభాతవార్త

ట్డీడీపీ కేంద్ర కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై నిర్వహించిన కీలక సమావేశంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. సమావేశం అనం తరం సీఎం నారా చంద్రబాబును ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై పలు అంశాలను వివరించారు. అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే తగి న నిధులు కేటాయించాలని కోరి నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మౌలిక సదుపాయాలు, ప్రజా అవసరాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలపై సీ ఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పట్ల సాను కూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.



సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే

# విజయవాడలో పలువురు మంత్రులతో ఎమ్మెల్యే పరిటాల సునీత భేటి

రాప్తాడు, జూన్ 3 ప్రభాతవార్త

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం పలువురు రాష్ట్ర మంత్రులతో భేటి అయ్యారు.

ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా విజయవాడకు వెళ్లిన ఆమె బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఆత్మకూరు మండలం, పంపనూరు సమీపంలో కొలువై ఉన్న శ్రీ సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి వారి దేవాలయం నూతన భవనాల నిర్మాణాలకు 6.70కోట్ల నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రికి శాలువాతో సత్కరించి ప్రజలు, భక్తుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రాప్తాడు నియోజకవర్గంలోని నూతన దేవాలయాలకు, అసంపూర్తిగా ఉన్న దేవాలయాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ధూప దీప నైవేద్యం కోసం దరఖాస్తు చేసుకున్న అర్చకులకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. భజన మందిరాలకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కూడా ఎమ్మెల్యే సునీత భేటి అయా ్యరు. నియోజకవర్గంలో నూతన సబ్ స్టేషన్లు, దరఖాస్తు చేసు కున్న రైతులకు ట్రాన్స్ ఫార్మర్లు మం జూరు చేయాలని కోరారు. విద్యుత్తు పోల్స్ కేబుల్స్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సునీత విజ్ఞ ప్తులపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. అన్ని అంశాలు పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తామన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత